ఫారెక్స్ రిజర్వులు డౌన్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: గత కొన్ని వారాలుగా పెరుగుతూ వచ్చిన విదేశీ మారకం నిల్వలు ఒక్కసారిగా కరిగిపోయాయి. విదేశీ కరెన్సీ రూపంలో ఉన్న ఆస్తుల విలువ కరిగిపోవడంతో గత వారాంతానికిగాను రిజర్వులు 5.24 బిలియన్ డాలర్లు తరిగిపోయి 617.23 బిలియన్ డాలర్లకు దిగాయి. ఈ విషయాన్ని రిజర్వు బ్యాంక్ తాజాగా వెల్లడించింది. అంతక్రితం వారంలో రిజర్వులు 622.5 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. గతవారంలో విదేశీ కరెన్సీ రూపంలో ఉన్న ఆస్తుల విలువ 4.81 బిలియన్ డాలర్లు తరిగి 546.52 బిలియన్ డాలర్లకు పడిపోయాయి. అంతర్జాతీయ మార్కెట్లో యూరో, పౌండ్, యెన్ కరెన్సీలు తీవ్ర ఆటుపోటులకు గురికావడంతో ఫారెక్స్ రిజర్వులు తగ్గడానికి ప్రధాన కారణమని తెలిపింది. అక్టోబర్ 2021లో ఫారెక్స్ రిజర్వులు రికార్డు స్థాయి 645 బిలియన్ డాలర్లకు చేరుకున్న విషయం తెలిసిందే.

254 బిలియన్ డాలర్లకు ఐటీ రంగం

ముంబై, ఫిబ్రవరి 16: దేశీయ టెక్నాలజీ ఇండస్ట్రీ అంచనాలకుమించి రాణిస్తున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి టెక్నాలజీ రంగ సంస్థల ఆదాయం 3.8 శాతం వృద్ధితో 254 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని ఇండస్ట్రీ బాడీ నాస్కాం అంచనావేస్తున్నది. ఇదే సమయంలో 60 వేల మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయని ప్రస్తుతేడాదికిగాను విడుదల చేసిన వార్షిక నివేదికలో పేర్కొంది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో ఇండస్ట్రీ 244.6 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని ఆర్జించిన విషయం తెలిసిందే.

- హార్డ్‌వేర్ రంగం 199 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని ఆర్జించనున్నది. క్రితం ఏడాదితో పోలిస్తే ఇది 3.3 శాతం అధికం.
- కొత్తగా ఈ ఏడాది మరో 9.3 బిలియన్ డాలర్ల ఆదాయం పెరగనున్నదని నాస్కాం పేర్కొంది.
- ఐటీ ఎగుమతుల నుంచి వచ్చే ఆదాయంలో ఇంజినీరింగ్ రీసర్చ్ అండ్ డెవలప్‌మెంట్(ఈఆర్‌డీ) రంగం వాటా 48 శాతంగా ఉండనున్నది.

పేటీఎంకు ఫాస్టాగ్ షాక్

ఫాస్టాగ్ ఇష్యూ బ్యాంకుల జాబితా నుంచి పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ ఔట్
తొలగించిన ఐహెచ్ఎంసీఎల్ • హైవే వాహనదారులకు సూచన

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌కు భారీ ఎదురుదెబ్బ తగిలింది. ప్రభుత్వ రంగ నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ)కు చెందిన టోల్ వసూళ్ల అనుబంధ సంస్థ ఇండియన్ హైవేస్ మేనేజ్‌మెంట్ కంపెనీ లిమిటెడ్ (ఐహెచ్ఎంసీఎల్) షాకిచ్చింది. ఫాస్టాగ్‌ను జారీచేసే బ్యాంకుల జాబితా నుంచి పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌ను తొలగించింది. జాతీయ రహదారులను వినియోగించే వాహనదారులకు పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ ద్వారా ఫాస్టాగ్ సేవలు ఇకపై అందబోవని, అంతరాయం లేని ప్రయాణం కోసం ఇతర బ్యాంకుల నుంచి ఫాస్టాగ్‌ను కొనుగోలు చేయాల్సిందిగా వారికి ఐహెచ్ఎంసీఎల్ సూచించింది. ఈ మేరకు ఎక్స్ (ట్విటర్)లో పోస్ట్ చేసింది.

పేటీఎంకు 30 శాతం వాటా

దేశంలో ప్రస్తుతం 8 కోట్లకుపైగా ఫాస్టాగ్ వినియోగదారులున్నారు. వీరిలో దాదాపు 30 శాతం పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ కస్టమర్లేనని ఎన్‌హెచ్ఏఐ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. కాగా, ఈ ఏడాది జనవరి 31న రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ).. పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌పై ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే. ఖాతాల్లో, వ్యాలెట్లలో, ఫాస్టాగ్‌లలో డిపాజిట్లు లేదా టాప్-అప్‌లను అంగీకరించరాదని స్పష్టం చేసింది. అయితే ఇంతకన్నా ముందే జనవరి 19న కొత్తగా ఫాస్టాగ్‌లను జారీ చేయకుండా పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌పై ఐహెచ్ఎంసీఎల్ నిషేధం విధించడం గమనార్హం. ఇదిలావుంటే ఆర్బీఐ మార్గదర్శకాల ప్రకారం కొత్త ఫాస్టాగ్ కోసం కేవైసీ ప్రక్రియను పూర్తి చేయాల్సిందిగా పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ యాజమర్లకు ఐహెచ్ఎంసీఎల్ స్పష్టం చేసింది. ఫాస్టాగ్ అనేది భారత్‌లో ఓ ఎలక్ట్రానిక్ టోల్ కలెక్షన్ సిస్టమ్. దీన్ని ఎన్‌హెచ్ఏఐ నిర్వహిస్తున్నది. జాతీయ రహదారులపై ప్రయాణిస్తున్నప్పుడు టోల్ ప్లాజాల వద్ద వాహనదారుల నుంచి నేరుగా టోల్ చార్జీలను రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ ద్వారా ఈ సిస్టమ్‌లో వసూలు చేస్తారు. వాహనాలు ఆగాల్సిన పని ఉండదు. దీనివల్ల ట్రాఫిక్ జామ్ సమస్యలు తప్పుతాయి.

కస్టమర్లకు మరో 15 రోజులు గడువు

పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌కు ఐహెచ్ఎంసీఎల్ షాకిచ్చినా.. ఆర్బీఐ ఊరటనిచ్చింది. కస్టమర్లకు ఇతర బ్యాంకుల్లోకి మారేందుకున్న గడువును *15* రోజులు పొడిగించింది. నిజానికి ఈ నెలాఖరుతోనే ఈ గడువు ముగిసిపోనుండగా, మార్చి *15* వరకు పెంచుతున్నట్టు శుక్రవారం ఆర్బీఐ ప్రకటించింది. కస్టమర్లు, మర్చంట్లు తమ ఖాతాలను పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ నుంచి ఇతర బ్యాంకుల్లోకి మార్చుకోవాలని సూచించింది. డిపాజిట్లు, క్రెడిట్ లావాదేవీలకూ ఇది వర్తిస్తుందని పేర్కొన్నది. ఖాతాదారుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొనే ఈ గడువు పెంపు అని ఈ సందర్భంగా ఆర్బీఐ తెలియజేసింది. ఈ నెల *29* తర్వాత సేవింగ్స్ బ్యాంక్ అకౌంట్లు, కరెంట్ అకౌంట్లు, నేషనల్ కామన్ మొబిలిటీ కార్డులు, ప్రీ-పెయిడ్ సాధనాలు, వ్యాలెట్లు, ఫాస్టాగ్‌లలో డిపాజిట్లను, టాప్-అప్‌లను కస్టమర్ల నుంచి తీసుకోరాదని ఆర్బీఐ ఇప్పటికే పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌కు స్పష్టం చేసిన సంగతి విదితమే. అయితే ఈ బ్యాంక్ ఖాతాల్లో ఉన్న నగదును ఎప్పుడైనా వాడుకోవచ్చంటూ అందుకు అనుమతినిచ్చింది. ఈ క్రమంలోనే నగదు బదిలీ, యూపీఐ సేవల్ని వినియోగించుకోవచ్చన్నది. మొత్తానికి 'మార్చి *15* తర్వాత పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌కు లింకైన ఖాతాల్లో నగదు జమ కాదు. కావున పేటీఎం యాప్ ద్వారా ఈ బ్యాంక్‌లోని తమ ఖాతాల్లో కొనుగోలుదారుల చెల్లింపులను జమ వేసుకుంటున్న వ్యాపారులు.. ఇప్పుడే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలి' అని ఆర్బీఐ తాజాగా సూచించింది.

ఫాస్టాగ్ కొనుగోలుకు వీలున్న బ్యాంకుల్లో..

- స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
- ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్
- బ్యాంక్ ఆఫ్ బరోడా
- హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్
- ఐసీఐసీఐ బ్యాంక్
- పంజాబ్ నేషనల్ బ్యాంక్
- కొటక్ మహీంద్రా బ్యాంక్
- కెనరా బ్యాంక్
- యాక్సిస్ బ్యాంక్

యాక్సిస్‌లోకి పేటీఎం నోడల్ అకౌంట్

ఆర్బీఐ ఆంక్షల నేపథ్యంలో వన్97 కమ్యూనికేషన్స్ పేటీఎం నోడల్ అకౌంట్‌ను పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ నుంచి యాక్సిస్ బ్యాంక్‌కు మార్చింది. పేమెంట్ యాప్ పేటీఎం మాతృ సంస్థ వన్97 కమ్యూనికేషన్స్ అన్నది తెలిసిందే. కాగా, లావాదేవీలకు ఎటువంటి ఆటంకం రాకూడదనే ఈ నిర్ణయానికి వచ్చినట్టు చెప్తున్నారు. దీంతో మార్చి 15 తర్వాత కూడా పేటీఎం క్యూఆర్, సౌండ్‌బాక్స్, కార్డ్ మెషీన్ వినియోగం ఎప్పట్లాగే కొనసాగగలదని, కస్టమర్లు, వ్యాపారులకు ఎలాంటి ఇబ్బంది రాదని అంటున్నారు. పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ నుంచి తమ నోడల్ అకౌంట్‌ను ఇతర బ్యాంకుల్లోకి మార్చుకుంటే పేటీఎం క్యూఆర్ కోడ్, పేటీఎం సౌండ్‌బాక్స్ లేదా పేటీఎం పీవోఎస్ టర్మినల్స్ మార్చి 15 తర్వాత కూడా కొనసాగుతాయని ఆర్బీఐ చెప్పింది. ఈ క్రమంలోనే యాక్సిస్ బ్యాంక్‌కు మార్చారు. ఫలితంగా పేటీఎం కస్టమర్లు, మర్చంట్లు పేటీఎం యాప్‌పై మునుపటిలాగే లావాదేవీలను చేసుకోవచ్చు.

25 వేలు తగ్గిన ఓలా స్కూటర్లు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: ప్రముఖ ఎలక్ట్రిక్ వాహన సంస్థ ఓలా..కొనుగోలుదారులకు శుభవార్తను అందించింది. ఎస్1 స్కూటర్ల ధరలను రూ.25 వేలు తగ్గిస్తున్నట్లు శుక్రవారం ప్రకటించింది. తగ్గించిన ధరలు ఈ నెల చివరివరకు అందుబాటులో ఉండనున్నాయని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. అలాగే ప్రస్తుతం స్కూటర్లపై ఇస్తున్న 40 వేల కిలోమీటర్లు లేదా 3 ఏండ్ల వ్యారెంటీని 80 వేల కిలోమీటర్లు లేదా 8 ఏండ్లకు పెంచుతున్నట్లు కంపెనీ ఫౌండర్, ఎండీ భావిష్ అగర్వాల్ తెలిపారు. ఇందుకోసం ఎలాంటి చెల్లింపులు జరుపాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టంచేశారు.

ధరల తగ్గింపు ఇలా...

- ఎస్ ఎక్స్+ మాడల్ రూ.1.09 లక్షల నుంచి రూ.84,999కి దిగిరానున్నది.
- ఎస్1 ఎయిర్ కూడా రూ.1.19 లక్షల నుంచి రూ.1.05 లక్షలకు..
- ఎస్ ప్రో మాడల్ ధర రూ.1.30 లక్షలకు తగ్గనున్నది. అంతకుముందు ఇది రూ. 1.48 లక్షలుగా ఉన్నది.

శుక్రవారం సింగరేణి భవన్‌లో జరిగిన సమావేశంలో కేంద్ర బొగ్గు శాఖ కార్యదర్శి అమిత్ లాల్ మీనాతో కంపెనీ సీఎండీ ఎస్ బలరామ్, ఇతర డైరెక్టర్లు

కోల్ గ్యాసిఫికేషన్ ప్లాంట్లు

రాష్ట్రంలో ఏర్పాటుకు సంస్థల ఆసక్తి

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (నమస్తే తెలంగాణ): బొగ్గు వెలికితీతకు బదులుగా భూగర్భంలోనే బొగ్గు నుంచి సిన్‌గ్యాస్‌ను ఉత్పత్తి చేసే ప్లాంట్లు త్వరలోనే రాష్ట్రంలో ఏర్పాటు కాబోతున్నాయి. కోల్ గ్యాసిఫికేషన్ ప్లాంట్లుగా పిలిచే వీటి ఏర్పాటుకు రాష్ట్రంలోని పలు సంస్థలు ఆసక్తి చూపుతున్నాయి. ఈ ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ శుక్రవారం ఇక్కడి ఓ హోటల్లో ఇండస్ట్రీ వర్గాలతో సమావేశమైంది. 53 సంస్థలు హాజరవగా, 40 కంపెనీలు ప్లాంట్లపట్ల ఆసక్తి చూపించాయి. ఈ సమావేశం అనంతరం కేంద్ర బొగ్గుశాఖ కార్యదర్శి అమృత్ లాల్ మీనా మీడియాతో మాట్లాడారు. రూ.8,500 కోట్ల పెట్టుబడి రాయితీలు ఇస్తున్నామని, మరిన్ని వసతులూ కల్పిస్తామన్నారు. కేంద్ర బొగ్గుశాఖ అదనపు కార్యదర్శి రూపేందర్ బ్రార్, సింగరేణి సంస్థ సీఎండీ ఎన్ బలరామ్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

గ్యాసిఫికేషన్ అంటే..

బొగ్గు, లిగ్నైట్‌లను వెలికితీసి అధిక ఉష్ణోగ్రత వద్ద మండిస్తే పొగ, కాలుష్యం వెలువడుతుంది. ఇది వాతావరణానికి హానిచేస్తుంది. దీనికి బదులుగా భూగర్భంలోనే బొగ్గు, లిగ్నైట్ ఖనిజాలను రసాయన చర్యల ద్వారా మండించి మీథేన్ వంటి గ్యాస్‌లను ఉత్పత్తి చేస్తారు. బొగ్గుపై కార్బన్ మోనాక్సైడ్, హైడ్రోజన్ గ్యాస్‌లను పంపించడం వల్ల గ్యాస్ ఉత్పత్తి అవుతుంది. ఇదే సిన్‌గ్యాస్. దీన్నే కోల్ గ్యాసిఫికేషన్ అంటారు.

సింగరేణి కొత్త గనులకు సహకరిస్తాం..

సింగరేణి పనితీరు సంతృప్తికరంగా ఉందని, కొత్త గనులకు పూర్తిగా సహకరిస్తామని అమృత్ లాల్ మీనా ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. సింగరేణి భవన్‌లో ఆయన సంస్థ సీఎండీ ఎన్ బలరామ్, డైరెక్టర్లతో సమీక్షించారు. సంస్థ పనితీరు, భవిష్యత్తు ప్రణాళికలను బలరామ్ వివరించారు. సింగరేణి ప్రాంతంలోని మూడు బొగ్గు బ్లాకులను సింగరేణికే కేటాయించాలని కోరారు. దీంతోపాటు కొత్త గనులకు త్వరగా అనుమతులివ్వాలన్నారు. ఇక సంస్థ చేపట్టిన సోలార్, థర్మల్ ప్రాజెక్టుల పనితీరును అడిగి తెలుసుకోవడమే కాకుండా థర్మల్, సోలార్, జియో థర్మల్, ఓబీ నుంచి ఇసుక ఉత్పత్తి, కమర్షియల్ ఇసుక తయారీ తదితర ప్రాజెక్టుల పనితీరునూ మీనా కొనియాడారు.

22 వేల పైకి నిఫ్టీ

376 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్

ముంబై, ఫిబ్రవరి 16: దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా నాలుగోరోజూ లాభాల్లో ముగిశాయి. బ్లూచిప్ సంస్థలకు లభించిన మద్దతుతో నిఫ్టీ ఏకంగా 22 వేల మార్క్‌ను మళ్లీ అధిగమించింది. అంతర్జాతీయ మార్కెట్లు కోలుకోవడం, మదుపరులు ఎగబడి కొనుగోళ్లు జరపడంతో వారాంతం ట్రేడింగ్‌లో సూచీలు భారీగా లాభపడ్డాయి. 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ 376 పాయింట్లు అధికమై 72,426కి చేరుకోగా, నిఫ్టీ 129.95 పాయింట్లు ఎగబాకి 22,040.70 వద్ద నిలిచింది. సూచీల్లో విప్రో అత్యధికంగా 4.79 శాతం పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది. దీంతోపాటు మహీంద్రా, ఎల్‌అండ్‌టీ, టాటా మోటర్స్, మారుతి, ఇన్ఫోసిస్, నెస్లె, ఇండస్‌ఇండ్ బ్యాంకు లు షేర్లు లాభాల్లో ముగిశాయి. కానీ, పవర్‌గ్రిడ్, ఎస్బీఐ, రిలయన్స్, ఎన్‌టీపీసీ, యాక్సిస్ బ్యాంక్‌లు నష్టపోయాయి. రంగాలవారీగా చూస్తే ఆటో, రియల్టీ, కన్జ్యూమర్ డ్యూరబుల్, క్యాపిటల్ గూడ్స్, హెల్త్‌కేర్, యుటిలిటీ, ఆయిల్ అండ్ గ్యాస్, పవర్, ఎనర్జీ రంగ షేర్లు లాభాల్లో ముగిశాయి.

గోఫస్ట్‌పై అజయ్ సింగ్ కన్ను

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: ఆర్థిక సంక్షోభంలో మూలనపడ్డ ప్రముఖ విమాన యాన సంస్థ గో ఫస్ట్‌ను స్పైస్‌జెట్ అధినేత అజయ్ సింగ్ కొనుగోలు చేయడానికి ముందుకొచ్చారు. బిజీ బీ ఎయిర్‌వేస్‌తో కలిసి ఇందు కు సంబంధించి బిడ్డింగ్‌ను దాఖలు చేశారు. కొత్త ఎయిర్‌లైన్‌కు ఆపరేటింగ్ పార్టనర్ పాత్ర పోషించనున్నదని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. గో ఫస్ట్ మే నెల నుంచి విమాన సర్వీసులను నిలిపివేసింది.

చిత్రం

హాలీవుడ్ రేంజ్‌కి తగ్గేలా లేదు..

బాహుబలి సిరీస్, ఆర్ఆర్ఆర్‌ల తర్వాత రాజమౌళి పంథా మార్చారు. మారిన ఇమేజ్‌నూ, మార్కెట్‌నూ దృష్టిలోపెట్టుకొని, స్థాయికి తగ్గట్టు అడుగులు వేస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. మహేశ్‌బాబుతో ఆయన రూపొందించనున్న సినిమాకు సంబంధించి ప్రతి విషయంలోనూ ఆచితూచి అడుగులేస్తున్నారట దర్శకధీరుడు. ఈ సినిమా స్క్రిప్ట్‌వర్క్ ఇప్పటికే పూర్తికావచ్చిందని సమాచారం. ఇక అధికారికంగా ప్రకటించి, షూటింగ్ మొదలపెట్టడమే తరువాయి. దీనికోసం అమెరికాకు చెందిన ఓ క్యాస్టింగ్ ఏజెన్సీతో రాజమౌళి చర్చలు జరిపారన్నది తాజా వార్త. అలాగే ఇందులోని పాత్రధారుల విషయంలోనూ రకరకాల పేర్లు వినిపిస్తున్నాయి. కథానాయికగా ఇండోనేషియాకు చెందిన చెల్సియా ఎలిజబెత్ ఇస్తాన్ నటించనున్నట్టు విశ్వసనీయ సమాచారం. అలాగే ప్రముఖ హాలీవుడ్ నటుడు క్రిస్ హెమ్స్‌వర్త్ కీలక పాత్ర పోషించనున్నట్టు తెలిసింది. సాంకేతిక నిపుణుల విషయంలో కూడా గతానికి భిన్నంగా అడుగులేస్తున్నారు రాజమౌళి. ఈ సినిమాకు సినిమాటోగ్రాఫర్‌గా పి.ఎస్.వినోద్, పీఎఫ్ఎక్స్ సూపర్‌వైజర్‌గా ఆర్.సి.కమల్ కణ్ణన్, ప్రొడక్షన్ డిజైనర్‌గా మోహన్ బింగి, ఎడిటర్‌గా తంబిరాజు వ్యవహరించనున్నారని ఫిల్మ్ వర్గాల టాక్. 'ఎస్ఎస్ఎంబీ29' అనే వర్కింగ్ టైటిల్‌తో ఈ చిత్రం రూపొందనున్నట్టు గతంలో వార్తలు రాగా, దాన్ని తొలగించి 'ఎస్ఎస్ఆర్ఎంబీ' అనే వర్కింగ్ టైటిల్‌ని ఖరారు చేసినట్టు సినీ వర్గాలు చెబుతున్నాయి. వ్యాపారపరంగా రాజమౌళి ఇమేజ్‌ని కూడా దృష్టిలోపెట్టుకొని, మహేశ్, రాజమౌళి ఇద్దరి పేర్లు కలిసివచ్చేలా వర్కింగ్ టైటిల్‌లో మార్పులు చేశారట. ఇక ఈ సినిమాకు 'మహారాజ్' అనే పేరును రాజమౌళి పరిశీలిస్తున్నారని తెలిసింది. ఈ టైటిల్‌పై ఒక్కొక్కరి స్పందన ఒక్కోలావుంది. మరి ఇందులోని నిజానిజాలు తెలియాలంటే ఇంకొన్ని రోజులు ఆగాల్సిందే.

అప్పుడు సరోజ.. ఇప్పుడు శీలావతి?

'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' తర్వాత అనుష్క నుంచి ఒక్క సినిమా కూడా రాలేదు. కథల ఎంపిక విషయంలో అచితూచి వ్యవహరించడమే ఈ జాప్యానికి కారణం అని తెలుస్తున్నది. ఎట్టకేలకు స్వీటీ ఓ చిత్రానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేసింది. కథను ఓకే చేయడమేకాక, గప్‌చిప్‌గా షూటింగ్ కూడా కానిచ్చేస్తున్నది. ఇంతకీ ఆ సినిమా ఏంటా! అనుకుంటున్నారా? అనుష్కతో 'వేదం' లాంటి గొప్ప సినిమాను తెరకెక్కించిన క్రిష్ దర్శకత్వంలో మళ్లీ ఓ సినిమా చేస్తున్నది అనుష్క. ఈ సినిమాకు 'శీలావతి' అనే ఆసక్తికరమైన టైటిల్ ఖరారు చేసినట్టు వార్తలు వినిపిస్తున్నాయి. నిజానికి 'శీలావతి' అంటే ఓ రకం చేప పేరు. మరి ఈ సినిమాకు ఆ పేరు పెట్టడానికి గల కారణం ఏంటి? అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. 'వేదం'లో అనుష్క పోషించిన సరోజ పాత్ర ప్రేక్షకుల హృదయాల్లో నిలిచిపోయింది, రానున్న ఈ 'శీలావతి' కూడా ఆమె కెరీర్‌లో ఓ మైలురాయిగా నిలిచిపోతుంది అని యూనిట్ సభ్యులు అంటున్నారు. ఉత్తరాంధ్ర నేపథ్యంలో ఈ చిత్రం రూపొందుతున్నట్టు టాక్. సాయిమాధవ్ బుర్రా సంభాషణలు అందిస్తున్నారు. క్రిష్, సాయిమాధవ్ కలయికలో వచ్చిన కృష్ణంవందేజగద్గురుమ్, కంచె, గౌతమీపుత్ర శాతకర్ణి చిత్రాలు ఎంతటి విజయాలను అందుకున్నాయో తెలిసిందే. వాటికి ఏ మాత్రం తగ్గని సామాజిక స్పృహతో కూడిన ఇతివృత్తంతో ఈ సినిమా రూపొందుతున్నట్టు సమాచారం. ప్రస్తుతం హైదరాబాద్‌లో షూటింగ్ జరుగుతున్నది.

దసరాకు రానున్న దేవర

ఎన్టీఆర్ నటిస్తున్న తాజా చిత్రం 'దేవర' దసరా కానుకగా అక్టోబర్ 10న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ విషయాన్ని మేకర్స్ శుక్రవారం ప్రకటించారు. తెలుగు, కన్నడ, తమిళం, మలయాళం, హిందీ భాషల్లో భారీ స్థాయిలో ఈ చిత్రాన్ని విడుదల చేయబోతున్నామని తెలిపారు. ఈ సందర్భంగా విడుదల చేసిన కొత్త పోస్టర్‌లో ఎన్టీఆర్ రౌద్రరసపూరితంగా కనిపిస్తున్నారు. కొరటాల శివ దర్శకత్వంలో ఎన్టీఆర్ ఆర్ట్స్, యువ సుధ ఆర్ట్స్ పతాకాలపై మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ కె ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. దసరా బరిలో ఈ సినిమా వస్తుండటంతో ఎన్టీఆర్ అభిమానులు సంబరపడిపోతున్నారు. తీర ప్రాంత నేపథ్య కథాంశంతో భారీ యాక్షన్ హంగులతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఎర్ర సముద్రం నేపథ్యంలో విడుదల చేసిన ఈ చిత్ర ఫస్ట్‌గ్లింప్స్‌కు అద్భుతమైన స్పందన లభించింది. ప్రకాష్‌రాజ్, శ్రీకాంత్, టామ్ షైన్ చాకో, నరైన్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: రత్నవేలు, సంగీతం: అనిరుధ్ రవిచందర్, ప్రొడక్షన్ డిజైనర్: సాబు సిరిల్, రచనా-దర్శకత్వం: కొరటాల శివ.

లవ్ @65

రాజేంద్రప్రసాద్, జయప్రద జంటగా వి.ఎన్.ఆదిత్య దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'లవ్ @ 65'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మించారు. ఈ చిత్రం ట్రైలర్‌ను శుక్రవారం విడుదల చేశారు. డెబ్భై నిండిన పెద్దాయన, 65 నిండిన పెద్దావిడ కాలనీ నుంచి పారిపోయిన ఆసక్తికరమైన సన్నివేశంతో ట్రైలర్ మొదలైంది. విచారణలో వారిద్దరూ ప్రేమించుకున్నారని, కలిసి బతకాలని నిర్ణయించుకున్నారని తెలిసింది. ఈ నేపథ్యంలో వినోదంతోపాటు మనసుల్ని కదిలించే భావోద్వేగా సమ్మేళనంగా ఈ ట్రైలర్ ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. త్వరలో సినిమా విడుదల కానుంది. కార్తీక్‌రాజు, స్పందన, క్రీష్, నిహంత్రీరెడ్డి, నారాయణరావు, ప్రదీప్ తదితరులు ఇతర పాత్రధారులు. ఈచిత్రానికి కథ: సుధీర్ చింటూ, మాటలు: లక్ష్మీభూపాల, కెమెరా: శ్యామ్ తుమ్మలపల్లి, సంగీతం: అనూప్‌రూబెన్స్, సహనిర్మాత: వివేక్ కూచిభొట్ల.

అది పాన్‌ఇండియా సమస్య

కెరీర్ ప్రారంభమైన నాటినుంచి కామెడీ సినిమాలకే పెద్ద పీట వేస్తూ యాభై పైచిలుకు చిత్రాలు పూర్తిచేసేశారు అల్లరి నరేశ్. సెకండ్ ఇన్నింగ్స్ మొదలయ్యాక, కామెడీని పక్కనపెట్టి సీరియస్ సబ్జెక్టులను ఎంచుకుంటూ నటుడిగా కూడా సత్తా చాటుతూ వచ్చారు. కాగా, ఇప్పుడు మళ్లీ కామెడీ జానర్‌కి తిరిగివచ్చారాయన. మల్లి అంకం దర్శకుడిగా పరిచయం చేస్తూ 'ఆ ఒక్కటీ అడక్కు'పేరుతో సినిమా చేస్తున్నారు అల్లరి నరేశ్. రాజీవ్ చిలక నిర్మిస్తున్న ఈ చిత్రం టైటిల్‌తోపాటు ఫస్ట్ లుక్, గ్లింప్స్‌ను శుక్రవారం మేకర్స్ విడుదల చేశారు. ఈవీవీ సత్యనారాయణ దర్శకత్వంలో వచ్చిన 'ఆ ఒక్కటీ అడక్కు' సినిమా ఇప్పటికీ చాలామందికి అభిమాన చిత్రం. ఇప్పుడు ఆయన తనయుడు అల్లరి నరేశ్ అదే పేరుతో సినిమా చేయడం ఇక్కడ ఆసక్తిని రేకెత్తిస్తున్న అంశం. ఇందులో గణ అనే పాత్రను పోషిస్తున్నారు నరేశ్. అతని పెళ్లి గురించి ఇంట్లోవాళ్లూ, బయట మిత్రులు అడగడంతో 'ఆ ఒక్కటీ అడక్కు' అని 'పెళ్లి అనేది పాన్ ఇండియా సమస్య' అని చెప్పడం గ్లింప్స్‌లో హైలైట్. వచ్చే నెల 22న విడుదల కానున్న ఈ చిత్రంలో 'జాతిరత్నాలు'ఫేం ఫరియా అబ్దుల్లా కథానాయిక. ఈ చిత్రానికి కెమెరా సూర్య, సంగీతం: గోపీసుందర్.

జీవితసారాన్ని ప్రబోధించిన స్ఫూర్తి ప్రదాత ఆయన..

'విజయాన్ని తలకెక్కించుకోకూడదు.. అపజయాన్ని మనసుకు తీసుకోకూడదు.. అలా చేస్తే అవి మనల్ని కిందకు లాగేస్తాయి. ఏ స్థాయిలో వున్నా నిలబడ్డ నేలను గౌరవించు. అదే నిన్ను ఉన్నతుడ్ని చేస్తుంది' అని ఓ సందర్భంలో ముకేష్ అంబానీ నాకు చెప్పారు. దాన్ని తూచా తప్పక పాటిస్తున్నాను. జీవితసారాన్ని బోధించి నాలో స్ఫూర్తిని నింపిన గొప్ప వ్యక్తి ముకేష్ అంబానీ' అన్నారు రణ్‌బీర్‌కపూర్. గత ఏడాది సినిమా రంగానికి చేసిన కృషికిగాను 'మహారాష్ట్రియన్ ఆఫ్ ది ఇయర్' అవార్డును అందుకున్నారు రణ్‌బీర్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 'నేను మంచి పౌరునిగా, కుటుంబం విషయంలో బాధ్యత గల ఫ్యామిలీ పర్సన్‌గా ఉన్నానంటే కారణం ముకేష్ అంబానీ సార్. ఆయన నాకు స్ఫూర్తి. ఈ రోజు నేను సమాజం గురించి ఆలోచిస్తున్నాను. పదిమందికి మంచి చేయాలని తాపత్రయపడుతున్నాను. లక్ష్యాలను ఛేదించడానికి ప్రయత్నిస్తున్నాను. నాలో ఈ మార్పులకు కారణం ఆయనే' అంటూ కొనియాడారు రణ్‌బీర్‌కపూర్.

రొమాంటిక్ ఎంటర్‌టైనర్

శాంతిచంద్ర, దీపికా సింగ్, సిమ్రితి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'డర్టీఫెలో'. ఆడారి మూర్తి సాయి దర్శకుడు. జి.యస్.బాబు నిర్మాత. ఈ సినిమాలోని 'సందెవేళ..' అనే పాటను దర్శకుడు సాయి రాజేష్ విడుదల చేశారు. 'రొమాంటిక్ ఎంటర్‌టైనర్ ఇది. హీరో పాత్ర కొత్త పంథాలో ఉంటుంది. నేటి యువతరానికి కనెక్ట్ అయ్యే అన్ని అంశాలుంటాయి. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తాం' అని చిత్ర బృందం పేర్కొంది. సత్యప్రకాష్, నాగినీడు, జయశ్రీ, సురేంద్ర తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: రామకృష్ణ, సంగీతం: సతీష్‌కుమార్, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: ఆడారి మూర్తి సాయి.

క్రైమ్ థ్రిల్లర్ 'ఆరంభం'

మోహన్ భగత్, సుప్రిత సత్యనారాయణ్, భూషణ్ కల్యాణ్, రవీంద్ర విజయ్ కీలక పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'ఆరంభం'. అజయ్ వి. నాగ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని అభి